ఎల్వోసీ అందజేత

నర్సింహులుకు ఎల్వోసీని అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డి రూరల్, మే 15: మండలంలోని వెల్లుట్ల గ్రామానికి చెందిన పడేకుల నర్సింహులుకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశాల మేరకు మాజీ సర్పంచ్ గంట సాయిలు బుధవారం ఎల్వోసీని అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న నర్సింహులు హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చేరాడు. పరీక్షించిన వైద్యులు గుండె ఆపరేషన్ చేయాలన్నారు. కాగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బాధితుడి పరిస్థితిని స్థానిక నాయకులు ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఆయన వెంటనే దవాఖాన వైద్యులతో మాట్లాడారు. తక్షణం ప్రభుత్వం తరపున రూ.లక్షా60వేల ఎల్వోసీని మంజూరు చేయించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు నాయకులు బుధవారం అందజేశారు.

నిఫ్ట్‌లో వైష్ణవికి 17వ ర్యాంకు

ఎల్లారెడ్డి, మే 15: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ ప్రవేశ పరీక్షలో ఎల్లారెడ్డికి చెందిన విద్యార్థిని ముత్యాల వైష్ణవి 17వ ర్యాంకు సాధించింది. దేశ వ్యాప్తంగా నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షకు 58 వేల మంది విద్యార్థులు హాజరు కాగా వైష్ణవికి మంచి ర్యాంకు రావడంతో ఆమెను పలువురు అభినందించారు. చిన్నప్పటి నుంచి ఫ్యాషన్ డిజైనింగ్‌పై దృష్టి సారించడంతో ఆమె తల్లిదండ్రులు రమేశ్, లక్ష్మి సైతం ప్రోత్సహించారు. ఇంటర్ విద్యను హైదరాబాద్‌లో చదివింది. ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకు సాధించింది. వైష్ణవి ఇంటర్ పూర్తిచేసిన దీక్ష కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు పలువురు అధ్యాపకులు ఆమెను అభినందించారు.

దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ

ఫిజియోథెరపీ నిర్వహిస్తున్న డాక్టర్ అరుణ్‌కుమార్

ఎల్లారెడ్డి రూరల్, మే 15: ఎల్లారెడ్డిలోని భవిత కేంద్రంలో బుధవారం ఫిజియోథెరపీ శిబిరాన్ని నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి మొత్తం ఏడుగురు దివ్యాంగ చిన్నారులు హాజరుకాగా.. వారితో డాక్టర్ అరుణ్‌కుమార్ వ్యాయామం చేయించారు. ఇంటి వద్ద చేయించాల్సిన వ్యాయామాల గురించి దివ్యాంగ చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. శిబిరంలో ఐఈఆర్‌పీలు వెంకటేశం, శివకుమార్ అప్ప, దివ్యాంగ చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల వితరణ

బెంచీలను అందజేస్తున్న లయన్స్ క్లబ్ బాధ్యులు

బిచ్కుంద, మే 15: బిచ్కుంద బస్టాండ్‌కు లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్ సభ్యులు రోహిణి కంటి దవాఖాన వారితో కలిసి ఆరు సిమెంట్ బెంచీలను అందజేశారు. బస్టాండ్‌లో బెంచీలు లేక ప్రయాణికులు ఇబ్బంది పడుతుండడంతో గమనించిన క్లబ్‌సభ్యులు బాన్సువాడ ఆర్టీసీ డీఎం సరిత ఆధ్వర్యంలో బుధవారం బెంచీలను వితరణ చేశారు. దీంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ డాక్టర్ ఓంప్రకాశ్, అధ్యక్షుడు డాక్టర్ రాజు, కార్యదర్శి గోపాల్, కోశాధికారి ప్రభాకర్, జగదీశ్, బాలరాజ్, ఆర్టీసీ కంట్రోలర్ లక్ష్మణ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో
ఆరోగ్య ఉపకేంద్ర భవనం

- పెచ్చులూడుతున్న పైకప్పు
- గోడలకు పగుళ్లు
- మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
- భయం, భయంగా గడుపుతున్న వైద్యసిబ్బంది, రోగులు

డోంగ్లీలోని ఆరోగ్య ఉప కేంద్ర భవనం

పెచ్చులూడిన ఉపకేంద్రం పైకప్పు, ఉపకేంద్రం ఆవరణలో చెత్తాచెదారం

డోంగ్లీ, మే 15: మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు ఆరోగ్య ఉప కేంద్రం ఉన్నాయి. ఆరోగ్య ఉప కేంద్ర భవం శిథిలావస్థకు చేరుకున్నది. రోజురోజుకూ స్లాబు పెచ్చులూడుతుండడంతోపాటు గోడల మధ్య పగుళ్లు ఏర్పడుతున్నాయి. ఈ ఆరోగ్య ఉప కేంద్రానికి పదుల సంఖ్యలో గర్భిణువు వస్తుంటారు. భవనం పెచ్చులు ఊడిపోతుండడంతో ఎప్పుడు కూలుతుందో అని భయంభయంగా గడుపుతున్నారు. గర్భిణులను పరీక్షించడంతోపాటు టీకాలు వేయడానికి సిబ్బంది ఇచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా పైకప్పు నుంచి నీళ్లు కారుతున్నాయని సిబ్బంది తెలిపారు. దీంతో విద్యుత్ సరఫరా చేసే వైర్లు, వాటి బోర్డులు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాత్రి వేళల్లో మందుబాబులకు అడ్డా..

డోంగ్లీలోని ఆరోగ్య ఉప కేంద్రం రాత్రి సమయంలో మందుబాబులకు అడ్డాగా మారిందని ప్రజలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలోనే పాఠశాల కూడా ఉండడంతో దవాఖాన, పాఠశాల ఆవరణలో మందుబాబులు మద్యం సేవిస్తున్నారు. అవువైపు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మందు సీసాలు, బాటిళ్లకు అక్కడే పారవేస్తున్నారు. నిత్యం మద్యం బాటిళ్లు, గ్లాసులు తీయాల్సి వస్తున్నదని వైద్య సిబ్బంది వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఎక్సైజ్ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. బెల్టుషాపులపై తగు చర్యలు తీసుకోవాలని అంటున్నారు.

కౌన్సిలర్ల టూర్

- బల్దియా చైర్మన్‌పై అవిశ్వాసం నేపథ్యంలో..
- ఢిల్లీతోపాటు పలు ప్రాంతాల పర్యటన
- 18న అవిశ్వాసంపై ఓటింగ్
- విహారయాత్ర నుంచి నేరుగా సమావేశానికి హాజరయ్యేలా ఏర్పాట్లు

ఎల్లారెడ్డి, మే 15: ఎల్లారెడ్డి బల్దియా చైర్మన్ కుడుముల సత్యనారాయణపై పెట్టిన ఆవిశ్వాస తీర్మానం కారణంగా కౌన్సిలర్ల కుటుంబాలు విహార యాత్రకు వెళ్లాయి. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు చైర్మన్ సత్యనారాయణ గతనెల 24న రాష్ట్ర రాజధానికి బయల్దేరారు. అదే సమయంలో ఎల్లారెడ్డి బల్దియా కౌన్సిలర్లు కామారెడ్డికి వెళ్లి కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌ను కలిశారు. చైర్మన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ తీర్మానాన్ని కలెక్టర్‌కు అందజేశారు. దీంతో ఈనెల 18వ తేదీన అవిశ్వాసంపై సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సమావేశానికి మరో రెండు రోజుల సమయం మాత్రమే ఉన్నది. కాగా లోక్‌సభ ఎన్నికల కోసం ఓటు హక్కును వినియోగించుకున్న వెంటనే కౌన్సిలర్లు తమ కుటుంబ సభ్యులతో కలిసి దేశ రాజధాని ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన తొమ్మిది మందితోపాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు కౌన్సిలర్లు కలిసి విహారయాత్రకు వెళ్లడం గమనార్హం. విహారయాత్రకు కేవలం కౌన్సిలర్లు మాత్రమే కాకుండా వారి కుటుంబ సభ్యులందరూ కలిసి వెళ్లడం విశేషం. విహారయాత్రకు వెళ్లిన వారిలో కౌన్సిలర్ దంపతులతో పాటు మొత్తం 11 మంది పిల్లలు కూడా ఉన్నట్లు తెలిసింది. 13న ఎల్లారెడ్డి నుంచి వెళ్లిన కౌన్సిలర్ల బృందం మంగళవారం ఢిల్లీలో ఉన్నట్లు సమాచారం. 17వ తేదీన హైదరాబాద్ చేరుకొని అక్కడి నుంచి 18వ తేదీన ఎల్లారెడ్డిలో నిర్వహించే సమావేశానికి నేరుగా హాజరవుతారని తెలిసింది.

కుంకుమ పూజలు

ఎల్లారెడ్డి, మే 15: ఎల్లారెడ్డి పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న బగలాముఖి ఆలయ ప్రాంగణంలో మంగళవారం కుంకుమార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

మామిడికాయలకు భలే గిరాకీ

బిచ్కుంద సంతలో మామిడికాయలను కొనుగోలు చేస్తున్న మహిళలు

మామిడికాయలను నరుకుతున్న రమేశ్

బిచ్కుంద, మే 15: ఎండాకాలంలో పెట్టుకునే మామిడికాయ పచ్చడి ఏడాదంతా నిల్వ ఉంటుంది. ప్రతి సంవత్సరం మే నెలలో ఊరగాయ పచ్చడి పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. మండల కేంద్రంలోని వారాంతపు సంతలో మామిడికాయలను కొనుగోలు చేసేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో కిలో మామిడికాయలు రూ.50వరకు ధర పలికాయి. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు మామిడికాయలు నేలరాలిపోవడంతో నష్టం వాటిల్లిందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మామిడి ముక్కలను నరుకుతూ.. ఉపాధి పొందుతూ..

ఎల్లారెడ్డి రూరల్, మే 15: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన మ్యాదరి రమేశ్ మామిడికాయలను ముక్కలు చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. సీజనల్ పనులు చేసుకుంటూ జీవనాన్ని సాగించే రమేశ్.. ప్రస్తుతం పచ్చళ్లు పెట్టుకునే సీజన్ కావడంతో మామిడికాయలను ముక్కలు చేయడం పనిగా పెట్టుకున్నాడు. ఒక్కో కాయను ముక్కలుగా నరికి నాలుగు రూపాయలు తీసుకుంటానని అతడు తెలిపాడు. రోజుకు వెయ్యి నుంచి పదిహేను వందల రూపాయల వరకు సంపాదిస్తున్నట్లు చెప్పాడు. ఉపాయం ఉంటే ఏ విధంగానైనా ఉపాధి పొందవచ్చని రమేశ్ నిరూపిస్తున్నాడు.

నేల చల్లబడ్డాక సాగు చేయండి

రైతు అవగాహన సదస్సులో ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ మల్లారెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీ, మే 15: రెండు, మూడు వర్షాలు పడి నేల చల్లబడ్డాక సాగుకు ఉపక్రమించాలని, తొలకరి చినుకులకే విత్తనాలు నాటి నష్టపోవద్దని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం ఉపసంచాలకులు (ఏడీఆర్) డాక్టర్ మల్లారెడ్డి రైతులకు సూచించారు. రైతులు తమకు సమీపంలో ఉన్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సలహా తీసుకొని సాగుకు ఉపక్రమించాలని చెప్పారు. సమతుల్య వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించేందుకు బుధవారం వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో సదస్సు జరిగింది. ఈ సదస్సుకు మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విలువైన సూచనలు చేశారు. ఈ ఏడాది వానకాలంలో మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సమతుల్య సాగు అవసరమని తెలిపారు. నీటి సాంకేతికతకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలు తీసుకోవాలని చెప్పారు. విత్తనాలు, ఎరువులు , పురుగుమందులను కొనుక్కునేటప్పుడు అధికారులతో సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అర్హత గల డీలర్‌తో లేదా వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులతో కొనుగోలు చేయాలని చెప్పారు. తప్పని సరిగా రసీదు పొంది పంట చివరి వరకు భద్రంగా దాచుకోవాలని సూచించారు. మూస పద్ధతిన సాగు చేస్తే అపార నష్టాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారులు ప్రేమ్ సింగ్, శేఖర్ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు నీటి సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం సంచాలకులు డాక్టర్ అనిల్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ ఉద్యాన పంటలు కూరగాయలు, పూలతోటల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు రైతులకు వివరించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

హెచ్చరిక ప్రకటన

నా క్లయింట్ శ్రీ G మహేందర్ రెడ్డి తండ్రి లేటు కృష్ణారెడ్డి, R/o 3 స్టేట్ మౌంటైన్ కోర్ట్, స్మిల్‌మ్యాన్, న్యూజెర్సీ 08558, USA వారు టెలిఫోన్ ద్వారా తెలిపిన సూచనల మేరకు సాధారణ ప్రజలందరికీ ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా నా క్లయింట్ కామారెడ్డి జిల్లా, మమ్మద్‌నగర్ మండలం, గాలిపూర్ గ్రామంలో గల సర్వే నం.16/1 (ఎ.01-03 గుంటలు), 16/2 (ఎ.02-00 గుంటలు), 151 (ఎ.01-00 గుంటలు), 199 (ఎ.02-13 గుంటలు), 200 (ఎ.02-10 గుంటలు), 205/A (ఎ.00-37 గుంటలు), 210 (ఎ.01-00 గుంటలు), 211/1/1 (ఎ.00-33 గుంటలు), 222 (ఎ.02-15 గుంటలు), 224 (ఎ.01-18 గుంటలు) మరియు 232/2 (ఎ.0-33 గుంటలు), మొత్తం విస్తీర్ణం ఎ.16-02 గుంటల వ్యవసాయ భూములు ఉమ్మడి కుటుంబ ఆస్తి యొక్క యజమాని మరియు స్వాధీనదారు.
అందువలన, శ్రీ G మధుసూదన్ రెడ్డి తండ్రి లేటు కృష్ణారెడ్డి మరియు శ్రీమతి G ప్రసూనా రెడ్డి భర్త శ్రీ G మధుసూదన్‌రెడ్డిలతో ఏవిధమైన అమ్మక వ్యవహారం కుదుర్చుకొనరాదని సాధారణ ప్రజలందరినీ నేను హెచ్చరిస్తున్నాను. ఈ నోటీసు ప్రచురణ తరువాత కూడా ఎవరైనా ఏవిధమైన అమ్మక వ్యవహారం కుదుర్చుకున్నా లేదా సంప్రదింపులు జరిపినా, ఈ ప్రచురణ తరువాత కూడా ఎవరైనా తదుపరిగా ముందుకుసాగినా వారు వారి స్వంత నష్టపూలీపై చేసినట్లవుతుంది మరియు వాటి నుండి ఏర్పడే అన్ని వ్యయాలు, పర్యవసానాలకు బాధ్యులు అవుతారు.
సం/- K. సర్వోత్తమ్ రెడ్డి
అడ్వకేట్
16-2-146/C/2, పరిమళ హైట్స్, దయానంద్ నగర్, మలక్‌పేట్, హైదరాబాద్-500036.
మొబైల్ : 9959191234
తేది:15-05-2024

దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి, మే 15 : వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో సెట్విన్ కింద శిక్షణ ఇవ్వనున్నదని, ఇందుకోసం దరఖాస్తు చేసుకోవాలని సెట్విన్ టీటీఐ తెలంగాణ ప్రభుత్వ కో ఆర్డినేటర్ సయ్యద్ మొయిజుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీసీఏ, పీజీడీసీఏ, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, మెహిందీ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉచిత స్టడీ మెటీరియల్ తోపాటు కోర్సు ఫీజులో 50 శాతం రాయితీ కల్పిస్తామని తెలిపారు. కోర్సు పూర్తి చేసిన తర్వాత సెట్విన్ ప్రభుత్వ సంస్థ ద్వారా సర్టిఫికెట్ అందజేస్తుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7386180456, 7989159121 ఫోన్ నంబర్లను సంప్రదించాలని, ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

దోమకొండ, మే 15 : మండల కేంద్రానికి చెందిన పలువురు మొబైల్ ఫోన్లను దోమకొండలో వేర్వేరు తేదీల్లో పోగొట్టుకున్నారని ఎస్సై గణేశ్ తెలిపారు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ యాప్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్స్‌ను ట్రేస్ చేశారు. మొబైల్ పోగొట్టుకున్న వారికి బుధవారం పోలీస్ స్టేషన్‌లో అందజేశారు.

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటు చేయాలని వినతి

జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న మండల ప్రజలు

రాజంపేట్, మే 15 : మండలంలోని కొండాపూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్ సింగ్‌కు బుధవారం వినతిపత్రం అందించామని జడ్పీటీసీ కొండా హన్మండ్లు, మండల ప్రజలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి నియోజక పరిధిలోని 12 గ్రామాలు గతంలో ఉమ్మడి తాడ్వాయి మండలంలో ఉండేవన్నారు. రాజంపేట కొత్త మండలం ఏర్పడిన తర్వాత కూడా గర్భిణులు చికిత్స కోసం రాజంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కాకుండా ఎర్రపహాడ్‌కు వెళ్లడం ఇబ్బందిగా ఉందన్నారు. వ్యాక్సిన్, మందులు, కొన్ని రకాల వైద్య సేవలకు ఇప్పటికీ ఎర్రాపహాడ్‌కు వెళ్లాల్సి వస్తుందన్నారు. మారుమూల గ్రామాలు చుట్టుపక్కల తండాల నుంచి ఎర్రాపహాడ్‌కు వెళ్లడం ఎంతో దూరంగా ఉందని చెప్పారు. రాజంపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో, ఆర్గొండ, కొండాపూర్, గుండారం ఉప ఆరోగ్య కేంద్రాల్లో అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పించాలని, కొండాపూర్‌లోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్, జిల్లా వైద్యాధికారికి వినతిపత్రం అందించామని వారు తెలిపారు.

రెడ్డి సంఘం నూతన కార్యవర్గం

భిక్కనూర్, మే 15 : మండలంలోని రామేశ్వపల్లి గ్రామ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా జిల్లాల కొండల్‌రెడ్డిని రెడ్డి సంఘం గ్రామ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్ రెడ్డి మాట్లాడుతూ.. రెడ్డి సంఘం ఐక్యతకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సూర్యకాంత్‌రెడ్డి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన రెడ్డి సంఘం కార్యవర్గ సభ్యులు

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలు ప్రతిస్పందించే ముందు తగిన లీతిలో క్షుణ్ణంగా విచారించి కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

RECRUITMENT
★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన లీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.